సాక్షి జనగామ

సోమవారం । 13 । అక్టోబర్ । 2025



ఉద్యోగులు నైపుణ్యం పెంపొందించుకోవాలి

ఉద్యోగులు నైపుణ్యం పెంపొందించుకోవాలని టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అన్నారు. - 8లో▸



గద్దెల ప్రాంగణ పునర్నిర్మాణం గొప్ప వరం

మేడారం సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని పునర్నిర్మించడం గొప్ప వరమని మంత్రి సీతక్క అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27°/22°

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. సాయంత్రం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు కాంగ్రెస్ పార్టీ సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం

జనగామ: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సంఘటన్ సృజన్ అభియాన్–తెలంగాణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 13న (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మండలంలోని షామీర్‌పేట శివారలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. జిల్లా సివిల్ సొసైటీ సంఘాల ప్రతినిధులు, సోషల్ కమ్యూనిటీ ప్రతినిధులు, జిల్లా అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో ఏఐసీసీ అబ్జర్వర్ దేబాసిస్ పట్నాయక్, టీపీసీసీ ప్రతినిధులు ఎమ్మెల్యే శంకరయ్య, ఎండీ అవేజ్, శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో చర్చ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సివిల్ సొసైటీ సంస్థలు, సామాజిక వర్గాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ విజ్ఞప్తి చేసింది.

జనగామ డిపో కండక్టర్‌కు ఉత్తమ అవార్డు



జనగామ: జనగామ ఆర్టీసీ సంస్థకు కిలోమీటరు పరిధిలో ఆదాయం(ఈపీకే) సమకూర్చడంతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్ ఎం.లింగయ్య ఉత్తమ అవార్డు దక్కించుకున్నారు. ఆదివారం హన్మకొండలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ఎండీ నాగిరెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నట్లు డిపో మేనేజర్ స్వాతి తెలిపారు. కండక్టర్ ఈపీకే 84.75 ప్రగతి సాధించారన్నారు. ఈ సందర్భంగా మేనేజర్‌తో పాటు సహచర ఉద్యోగులు, కార్మికులు కండక్టర్ లింగయ్యను అభినందించారు.

మర్రి పాపిరెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం



దేవరుప్పుల: స్వాతంత్య్ర సమరయోధుడు మర్రి పాపిరెడ్డి జీవితం స్ఫూర్తిదాయకమని ప్రెస్ అకాడమీ రాష్ట్ర చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం మండల కేంద్రంలోని దివంగత ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు మర్రి పాపిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయన స్మారక విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మర్రి పట్టాభిరామిరెడ్డి–అరుణ దంపతుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ ముకుంద్‌రెడ్డి, జఫర్‌గఢ్ తహసీల్దార్ అర్జున్, డాక్టర్ వీఎస్‌రెడ్డి, విజయ డెయిరీ జిల్లా అధ్యక్షుడు ధర్మారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధి కల్వల భాస్కర్‌రెడ్డి, పీఎసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి, తీగల దయాకర్, ఈదునూరి నర్సింహరెడ్డి, ఏల సుందర్, డీలర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుగ్గింపుడి కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఆటోలో ప్రసవం’పై స్పందించిన 108 టీం

లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన మర్రికుక్కల కనకలక్ష్మి అనే గర్భిణి 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ఈనెల 11న నెల్లుట్ల సమీపంలో ఆటోలో ప్రసవం జరిగిన విషయంపై ×ఆటోలోనే ప్రసవం॰ అనే శీర్షికతో వచ్చిన కథనానికి 108 స్టేట్ హెచ్‌ఆర్ టీంలో కదలిక వచ్చింది. ఆ సమయంలో మండల కేంద్రానికి చెందిన 108 అంబులెన్స్ ఎక్కడికి వెళ్లిందనే విషయంపై జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ సలీంను ఆదివారం వివరణ కోరింది. ఈ విషయంపై ప్రోగ్రాం మేనేజర్ సలీం వివరణ ఇస్తూ లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన 108 వాహనం జనగామ ఎంసీహెచ్ నుంచి హన్మకొండ జీహెచ్‌ఎంకు మరో కేసు దృష్ట్యా వెళ్లిందని, దీంతో అందుబాటులో ఉన్న దేవరుప్పుల వాహనం 29 కి.మీ. 35 నిమిషాల్లో నెల్లుట్లకు ఆటో ఉన్న గర్భిణి వద్దకు చేరుకుందని తెలిపారు. అప్పటికే ఆటోలో శిశువు తల బయటకు రావడంతో ఈఎంటీ కళ్యాణి పురుడిపోసి బొడ్డుతాడు మెడ నుంచి తప్పించి కత్తిరించి ప్లాసెంటాను తీసి శిశువును నియోనేటర్ కేర్ ఇచ్చుకుంటూ ఎంసీహెచ్ జనగామకు తల్లిబిడ్డలను క్షేమంగా తీసుకెళ్లారని వివరించారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఉండగా ఆటోలో ప్రసవం కావడంపై వైద్య ఆరోగ్యశాఖ నుంచి డీఎంహెచ్‌ఓను సైతం వివరణ కోరినట్లు తెలిసింది. కాగా సదరు గర్భిణి స్థానిక పీహెచ్‌సీకి రాకుండా ఎంసీహెచ్‌కు వెళ్లి మళ్లీ దుస్తులు తీసుకొచ్చుకుంటానని ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో ఆటోలో వెళ్లిందని వివరణ ఇచ్చారు.

కొనుగోళ్లకు సిద్ధం

2.05లక్షల టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం

- జిల్లాలో 309 కేంద్రాల ఏర్పాటు
- సన్నరకం, దొడ్డు రకం వేర్వేరుగా కొనుగోలు
- ఇప్పటికే జిల్లాలో ప్రారంభమైన కొనుగోలు కేంద్రాలు
- కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించేలా ప్రణాళిక



అడవికేశ్వాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీఓ అధికారులు (ఫైల్)

జనగామ రూరల్: వానాకాలం సీజన్‌కు సంబంధించి వరికోతలు ప్రారంభమయ్యాయి. ముందస్తు సాగు చేసిన వారు వారం నుంచే కోతలు ప్రారంభించారు. ఈనేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లకు జిల్లా యంత్రాంగం సమాయత్తమైంది. జిల్లా వ్యాప్తంగా 309 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. కాగా ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు జనగామ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించగా ఈనెల 13 (సోమవారం) నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించనున్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 2,13,978 ఎకరాల్లో వరి పంట సాగుకాగా.. 5,43,057 టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేస్తున్నారు. 2,05,057 టన్నుల ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సన్న రకానికి మద్దతు ధర రూ.2,389లు, బోనస్‌గా క్వింటాల్‌కు రూ.500, అలాగే దొడ్డు రకానికి రూ.2,369 మద్దతు ధర లభించనుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని పంట కొనుగోలుకు సంబంధించి డీఆర్డీఓ, డీసీఓ డీపీఎం, డీటీలు, జిల్లా, మండల, గ్రామ స్థాయి సెర్ప్ సిబ్బంది, కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులతో ఇప్పటికే కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

మౌలిక వసతుల కల్పన

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని అధికారులు నిర్ణయించారు. కొనుగోలు చేసిన ధాన్యంపై వచ్చే కమీషన్ నుంచి రైతులు తాగడానికి మంచినీరు, టెంట్, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలి. అలాగే ప్యాడీ సెంటర్లను శుభ్రంగా ఉండాలి. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ప్రతీరోజు ట్యాబ్ ఎంట్రీ చేయడానికి ఏర్పాటు చేసుకుంటున్నారు.

వెంటనే మిల్లులకు పంపించేలా..

రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు పంపించేలా ప్రణాళిక రూపొందించారు. ఈమేరకు అవసరాలకు అనుగుణంగా లారీలు, హమాలీలను సిద్ధం చేసుకుంటున్నారు. అదేవిధంగా కొనుగోళ్లకు సంబంధించి ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో వెంటనే జమ అయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో కొనుగోలు కేంద్రాలు

దొడ్డు రకం కొనుగోలు కేంద్రాలు	-198
ఐకేపీ	- 116
పీఏసీఎస్‌లు	- 82
సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు	- 101
ఐకేపీ	- 69
పీఏసీఎస్‌లు	- 42
మొత్తం కేంద్రాలు	- 309

సమన్వయంతో పని చేయాలి

గత రెండు సీజన్‌లలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. ఈసారి కూడా పక్కా ప్రణాళికతో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరగాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. వానాకాలం పంట కొనుగోలుపై ఆర్డీఓ, సివిల్ సప్లై, డీఆర్డీఓ, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, జిల్లా, మండల, గ్రామ స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్డీఓ, గన్నీ గోదాం ఇన్‌చార్జ్‌లు, రైస్ మిల్లర్ల అసోసియేషన్లు అందరూ సమన్వయంతో పనిచేస్తే కొనుగోళ్లు సజావుగా సాగుతాయి. ప్రతి కేంద్రంలో కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్‌లు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, టార్పాలిన్ మొదలగు వసతులు ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది.

మహిళా సంఘాలకు పెద్దపీట

జిల్లాలో ఏర్పాటు చేస్తున్న 309 కొనుగోలు కేంద్రాల్లో మహిళా సంఘాలకే పెద్దపీట వేశారు. ఐకేపీ, పీఏసీఎస్, రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నారు. కేంద్రాల్లో ఎప్పటికప్పు డు ధాన్యం సేకరణ వివరాలను వ్యవసాయశాఖ సేకరించాలి. ధాన్యం పూర్తి వివరాలు ప్రతీరోజు నమోదు చేయాలి. కొనుగోలు రవాణా, డ్రై మిషన్, ప్యాడీ క్లీనర్స్, వేయింగ్ మిషన్లు, తేమ శాతం, ఆటోమెటిక్ జాలి మిషన్లు, ముందస్తుగా సిద్ధంగా ఉంచుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు వచ్చాయి. సివిల్ సప్లై శాఖ ద్వారా కేంద్రాల్లో గన్నీసంచులు సిద్ధం చేసుకుంటున్నారు.

అన్ని ఏర్పాట్లు చేపట్టాం



జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అన్ని చర్యలు చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా 309 సెంటర్లను ఎంపిక చేశాం. కేంద్రాల వద్ద టోల్ ఫ్రీ నెంబర్‌ను ప్రదర్శిస్తాం. అవసరమైన మేర గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలి. తేమ శాతం చూసుకొని నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి.

– అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేటెంట్ సీఎందే

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తప్పక అమలుచేయాల్సిన పరిస్థితి త్వరలోనే వస్తుందని, ఎప్పటికైనా బీసీ రిజర్వేషన్ల పేటెంట్ సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఘన్‌పూర్ పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి అతిథులుగా హాజరైన ఏఐసీసీ పరిశీలకులు దేబాసిస్ పట్నాయక్, టీపీసీసీ పరిశీలకులు షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య, ఎండీ అఫిజ్, శ్రీకాంత్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి ముందుగా మీడియా సమావేశంలో కడియం మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, బీజేపీ, బీఆర్‌ఎస్ బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్నాయన్నారు.

ఆసక్తి ఉన్నవారు నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చు: ఏఐసీసీ పరిశీలకుడు పట్నాయక్

డీసీసీ అధ్యక్ష పదవి కోసం అర్హత, ఆసక్తి ఉన్న వారందరూ నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చని ఏఐసీసీ పరిశీలకులు దేబాసిస్ పట్నాయక్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుడోజు రాంబాబు, ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీశ్‌రెడ్డి, శివరాజ్‌యాదవ్, నాయకులు బెలిదె వెంకన్న, బేతి జయపాల్‌రెడ్డి, కనకం గణేశ్, అంబటి కిషన్‌రాజ్, నాగరబోయిన శ్రీరాములు, రజాక్‌యాదవ్, కొలిపాక సతీశ్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభిప్రాయంతోనే డీసీసీ ఎన్నిక

- ఏఐసీసీ పరిశీలకుడు దేబాసిస్ పట్నాయక్



డీసీసీ అధ్యక్ష పదవి దరఖాస్తులను విడుదల చేస్తున్న ఏఐసీసీ పరిశీలకుడు దేబాసిస్

పాలకుర్తి టౌన్: కార్యకర్తల అభిప్రాయ సేకరణతోనే డీసీసీ ఎన్నిక ఉంటుందని ఏఐసీసీ పరిశీలకుడు దేబాసిస్ పట్నాయక్ అన్నారు. డీసీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సంఘటన్ సృజన్ అభియాన్ తెలంగాణ కార్యక్రమం పేరిట ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ పరిశీలకులు షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య, ఎండీ అఫిజ్, శ్రీకాంత్‌యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ పరిశీలకుడు దేబాసిస్ పట్నాయక్ మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో స్థానిక నాయకులతోనే నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి ఆసక్తి గల ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజల మనసులో ఉన్న నిజమైన ప్రజాస్వామ్యానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు లకావత్ లక్ష్మీనారాయణనాయక్, కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, ఎర్రబెల్లి రాఘవరావు, గంగు కృష్ణమూర్తి, కుమారస్వామి, శ్రీరాములు నాయకుల పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి ఝాన్సీరెడ్డి దరఖాస్తు

జనగామ డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి దరఖాస్తును నియోజకవర్గ నాయకులు ఏఐసీసీ అబ్జర్వర్ పట్నాయక్, టీపీసీసీ పరిశీలకులకు అందజేశారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

జనగామ రూరల్: జిల్లాలోని 50 మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి అనిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీ సామాజిక వర్గానికి 1, ఎస్సీకి 5, గౌడ సామాజిక వర్గానికి 13 కేటాయించగా, 31 జనరల్ కేటగిరి కింద ఉన్నాయన్నారు. ఆసక్తిగల దరఖాస్తుదారులు ఎలాంటి ఒత్తిడి లేకుండా నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చని, ఏదైనా మద్యం దుకాణానికి తక్కువ దరఖాస్తులు వస్తే ఆర్‌సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని, సందేహాలు ఉంటే డీపీఈఓ జనగామను సంప్రదించాలని కోరారు.

కల్యాణం.. కమనీయం

కనులపండువగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి వివాహ మహోత్సవం

- వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- సాయంత్రం గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు



శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణానికి హాజరైన భక్తులు

జఫర్‌గఢ్ : మండల కేంద్రంలో శ్రీవేల్పుగొండ శ్రీలక్ష్మీనర్సింహ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణమహోత్సవం ఆదివారం కన్నులపండువగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలుత వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. అనంతరం భక్తుల సమక్షంలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. సుమారు నాలుగు గంటల పాటు సాగిన ఈ కల్యాణమహోత్సవాన్ని భక్తులు కనులార తిలకించి భక్తి పారవశ్యంతో మునిగిపోయారు. ఈ వేడుకలను తిలకించిన అనంతరం భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి మొక్కులను సమర్పించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సమయంలో గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, ఆటపాటలు, మహిళల కోలాటాల నృత్యాల మధ్య పలు పురవీధుల గుండా స్వామివారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు వెంకటాచార్యులు, శ్రీనివాసచార్యులు, కృష్ణమాచార్యులతో పాటు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా చివరి రోజు శాంతిహోమం, మహాపూర్ణాహుతి, చక్రస్నానం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రైతు కుటుంబానికి న్యాయం చేయాలి



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతు బంధువులు, గ్రామస్తులు



రాస్తారోకో చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఏసీపీ భీమ్‌శర్మ

- స్టేషన్ ఘన్‌పూర్‌లో కుటుంబసభ్యులు, గ్రామస్తుల రాస్తారోకో
- విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతోనే చనిపోయాడని ఆరోపిస్తూ ఆందోళన

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పాంనూర్ గ్రామంలో వ్యవసాయ భూమి వద్ద విద్యుదాఘాతంతో శనివారం మృతిచెందిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులు, బంధువులు ఆదివారం ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన, జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. పాంనూర్ గ్రామానికి చెందిన కోట వాసు అనే రైతు వ్యవసాయ పనుల నిమిత్తం శనివారం తన వ్యవసాయభూమి వద్దకు వెళ్లి పొలంలో తెగి పడి ఉన్న విద్యుత్ ఎల్‌టీ లైన్ తీగతో విద్యుదాఘాతంతో మృతిచెందిన సంగతి తెలిసిందే. కాగా విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే వాసు మృతిచెందాడని ఆరోపిస్తూ మృతుడి భార్య, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం సబ్‌స్టేషన్ ఎదుట ఉన్న జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. రైతు కుటుంబానికి న్యాయం చేయాలని, విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నినదించారు. దాదాపు మూడు గంటల పాటు రాస్తారోకో చేపట్టడంతో జాతీయ రహదారిపై ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. రైతు కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు ఆందోళన చేస్తున్నా సంబంధిత అధికారులు రాకపోవడం గమనార్హం. కాగా విషయం తెలుసుకున్న ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ జి.వేణు, ఎస్‌ఐలు వినయ్‌కుమార్, రాజేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబీకులకు, గ్రామస్తులకు నచ్చజెప్పారు. వారు ససేమిరా వినకపోవడంతో విద్యుత్‌శాఖ అధికారులతో ఫోన్‌తో మాట్లాడించారు. మృతిచెందిన రైతు కుటుంబానికి విద్యుత్‌శాఖ నుంచి న్యాయం చేస్తామని, ఏమైనా ఉంటే వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సర్దిచెప్పడంతో ఎట్టకేలకు రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా రైతు కుటుంబ సభ్యులు, పాంనూర్ గ్రామస్తులు మీడియాతో మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రైతు వాసు మృతిచెందాడని ఆరోపించారు. గతంలో పలుమార్లు విద్యుత్ తీగల సమస్యపై ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు ప్రజావాణి కార్యక్రమం

జనగామ రూరల్: ప్రజావాణి కార్యక్రమం ఈనెల 13న (సోమవారం) నిర్వహించబడుతుందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలు ఎత్తివేయడంతో కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి యథాతథంగా ఉంటుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కారాఘోరం!

జైళ్లలో ఆందోళనకరంగా ఖైదీల సహజ మరణాలు, ఆత్మహత్యలు

- జైళ్ల కుదింపుతో ఇబ్బడిముబ్బడిగా విచారణ ఖైదీలు
- కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- సంచలనంగా జనగామ సబ్‌జైలు ఖైదీ ఆత్మహత్య



జనగామ సబ్‌జైలు ఎదుట కుటుంబసభ్యుల ఆందోళన

సాక్షిప్రతినిధి, వరంగల్:

- వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన పెండ్యాల సుచరిత (36) సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉండి మృతి చెందారు. సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో ఆమెను ఆగస్టు 13న నర్సంపేట సబ్ జైలుకు తరలించారు. సబ్‌జైలులో అనారోగ్యానికి గురైన ఆమెను నర్సంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆగస్టు 21న మృతి చెందింది.
- జనగామ సబ్‌జైలులో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ ఖైదీ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగారాజుపల్లికి చెందిన వరాల మల్లేశ్ (42) హత్యాయత్నం కేసులో జనగామ సబ్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి మల్లేశ్ నీటిలో బ్లీచింగ్ పౌడర్ కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన అధికారులు ఖైదీని వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.

...ఖైదీల్లో పరివర్తన తీసుకురావాల్సిన కారాగారాలు సహజ మరణాలు, ఆత్మహత్యలకు వేదికలవుతున్నాయి. నేరాలు, నేరస్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండగా.. ఓ వైపు జైళ్ల కుదింపు, మరోవైపు విచారణలు, శిక్షలు, విడుదల లేక ఖైదీలతో కారాగారాలు కిటకిటలాడుతున్నాయి. కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అధికారులు సబ్‌జైళ్లలో రకరకాల పనులు చేయిస్తూ వేధిస్తుండడమే ఖైదీల మృతికి కారణంగా చెబుతున్నారు. కట్టుదిట్టమైన భద్రత ఉండే జైళ్లలో ఖైదీలకు ఆత్మహత్యకు కారణాలయ్యే వస్తువులను దూరంగా సిబ్బంది ఉంచాలి. వాటిపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఖైదీల ఆత్మహత్యాయత్నం ఘటనలు పునరావృతం అవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. అయితే, జైలులో అంతా నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే సామర్థ్యానికి మించి జిల్లా, సబ్‌జైళ్లలో ఖైదీలను ఉంచి.. ఆ మేరకు బడ్జెట్, సౌకర్యాలు, అధికారులు, సిబ్బంది లేక నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోందన్న చర్చ జరుగుతోంది. సిబ్బంది, ఎస్కార్ట్ కొరతతో నెలల తరబడి విచారణలు వాయిదా పడి జైళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఫలితంగా జిల్లా, సబ్‌జైళ్లలో ఓ వైపు సహజ మరణాలు, మరోవైపు ఆత్మహత్యాయత్నాలు, ఆత్మహత్యలు చోటుచేసుకుంటున్నాయన్న చర్చ జరుగుతోంది.

ఖైదీలు పెరుగుతున్నా.. మారని పరిస్థితులు

ఖైదీల సంఖ్య పెరుగుతున్నా.. అందుకు అనుగుణంగా జైళ్ల పరిస్థితి మారడం లేదు. నేషనల్ క్రైం రికార్డు బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ఇటీవల విడుదల చేసిన ‘ప్రిజన్ స్టాటిస్టిక్స్ ఇండియా–2023’లో ఇవే అంశాలను ప్రస్తావించింది. ఈ లెక్కల ప్రకారం ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మెరుగే అయినప్పటికీ.. రాష్ట్రంలో అన్ని రకాల జైళ్లు కలిపి 50 ఉండగా.. అన్నింట్లో సామర్థ్యాన్ని మించి ఖైదీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్‌లో వరంగల్ సెంట్రల్ జైలుతోపాటు పరకాల, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట సబ్‌జైళ్లలో కలిపి సుమారు 680 మంది ఖైదీలు ఉండాలి. వరంగల్ సెంట్రల్ జైలు కూల్చివేసే నాటికి ఒక్క ఆ జైలులోనే వెయ్యి మంది వరకు ఉన్నట్లు రికార్డులున్నాయి. 2021లో సెంట్రల్ జైలు ఎత్తివేయగా.. నర్సంపేట సబ్‌జైలును కూడా రద్దు చేశారు. వీటి స్థానంలో మామునూరు ఒక ఓపెన్ ఎయిర్ జైలును ప్రతిపాదించారు. నర్సంపేట సబ్‌జైలు స్థానంలో మహిళల ప్రత్యేక జైలు ఏర్పాటు చేశారు. జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాలతోపాటు ఓపెన్ ఎయిర్ జైలు కలిపితే.. వాటిలో ఖైదీల సామర్థ్యం 50 నుంచి 80 లోపలే. ఆమేరకు పెట్టుకుని ఇతర ఖైదీలను ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జైళ్లకు తరలించాల్సి ఉండగా.. ఉమ్మడి వరంగల్‌లోని పోలీస్‌స్టేషన్లలో నమోదైన వివిధ కేసుల్లో విచారణ ఖైదీలు, శిక్షలు పడిన వారు సుమారు 300 మంది జిల్లాల్లోని జైళ్లలోనే ఉంటుండడంతో అవి కిక్కిరిసిపోతున్నాయి.

సహజ మరణాలకు అనేక కారణాలు..

సబ్‌జైలులో సహజ మరణాలకు అనారోగ్యమే ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. ముందుగా ఉన్న ఆరోగ్య సమస్యలు, జైలులో సరైన వైద్య సంరక్షణ లేకపోవడం, జైలు వాతావరణం వల్ల వచ్చే ఒత్తిడి వంటి కారణాల వల్ల మరణాలు తరచూ సంభవిస్తాయంటున్నారు. జైలు, పోలీసు కస్టడీలో గుండె జబ్బుల వంటివి సాధారణంగా కనిపిస్తాయని వైద్య నిపుణుల అభిప్రాయం.

చిన్న ఆరోగ్య సమస్యలు కూడా ప్రాణాంతకమే..

వాంతులు, విరేచనాలు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, ముందుగా ఉన్న దీర్ఘకాలిక వ్యాధులు ఖైదీల మరణానికి కారణం కావొచ్చు. జైలులో సరైన వైద్య సంరక్షణ అందుబాటులో లేకపోతే చిన్న ఆరోగ్య సమస్యలు కూడా తీవ్రమై ప్రాణాంతకంగా మారుతాయి. జైలులోని ఒత్తిడితో కూడిన వాతావరణం కూడా ఖైదీల ఆరోగ్య పరిస్థితిని క్షీణింపజేసి మరణానికి దారితీస్తుంది. అయితే, పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా ఇవి తేలుతాయి.

– డాక్టర్ కేశవులు, మానసిక వైద్య నిపుణుడు

క్లుప్తంగా

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

హన్మకొండ: టీపీసీసీ త్వరలో చేపట్టనున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల నియామకాల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం సముచిత స్థానం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ చేసిందని గుర్తుచేశారు. ఇందులో భాగంగా సంస్థాగతంగా నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ పదవుల్లో బీసీలకు సరైన వాటా కల్పించాలన్నారు. రాష్ట్రంలో 33 జిల్లాల్లో 17 డీసీసీ అధ్యక్ష పదవులు, వరంగల్ ఉమ్మడి 6 జిల్లాల్లో 3 డీసీసీ అధ్యక్ష పదవులను బీసీలకు కేటాయించి మాట నిలుపుకోవాలని ఏఐసీసీ, టీపీసీసీని కోరారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ కమిటీ


సోమన్న, అధ్యక్షుడు


సునీల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల కళాశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా జె.సోమన్న (ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల) ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.సునీల్‌రెడ్డి (బొల్లికుంట వీసీపీఈ ఫిజికల్ డైరెక్టర్), ఉపాధ్యక్షులుగా పి.అజయ్, ఎస్.కుమారస్వామి, బి.రమేశ్, జి.సునీత, కోశాధికారిగా ఎస్.కిరణ్‌కుమార్ గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.కుమారస్వామి, కె.మధుకర్, బి.వెంకట్రామ్, జె.జేత్యాతోపాటు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మహ్మద్ కరీం వ్యవహరించారు. నాలుగేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుంది.

అనుమానాస్పద స్థితిలో అంగన్‌వాడీ టీచర్ మృతి


మాధవి (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఓ అంగన్‌వాడీ టీచర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన మహబూబాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని బెస్తబజారు ప్రాంతంలో నివాసం ఉండే బానోత్ మాధవి (42) జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీలో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తోంది. భర్త కృపాకర్ చాలా కాలం క్రితం మృతిచెందగా ఆమెకు కుమార్తె షారోనిదీప్తి ఉంది. ప్రతీ ఆదివారం తల్లీకుమార్తెలు చర్చికి వెళ్తారు. ఆదివారం ఉదయం కూడా కుమార్తె యథావిధిగా చర్చికి వెళ్లింది. మధ్యాహ్నం తల్లి మాధవికి ఫోన్ చేస్తే ఆమె నుంచి ఎలాంటి స్పందనరాలేదు. మూడు గంటల తర్వాత కుమార్తె ఇంటికి వచ్చి చూడగా తల్లి ఉరేసుకుని కనిపించింది. దీనిపై టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డికి సమాచారం ఇవ్వగా టౌన్ ఎస్సై అలీమ్ హుస్సేన్ ఘటనాస్థలికి చేరుకుని మాధవి మృతదేహాన్ని కిందకు దింపారు. మృతురాలు మాధవి శరీరంపై పలుచోట్ల గాయాలుండగా తన తల్లి మృతిపై తనకు అనుమానం ఉందని కుమార్తె షారోనిదీప్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్ ప్రాంగణంలో రైల్ కోచ్ హోటల్



రైల్వే స్టేషన్‌లో ఏసీ వెయిటింగ్ హాల్



ప్లాట్‌ఫామ్..



ఎస్కలేటర్..



వావ్.. వరంగల్

'హైఫై'గా ఓరుగల్లు రైల్వే స్టేషన్

- ఓవైపు కాకతీయ కళావైభవం.. ఇంకోవైపు కార్పొరేట్ హంగులు
- ప్రయాణికులకు అందుబాటులో ఏసీ, నాన్ ఏసీ వెయింటింగ్ హాళ్లు
- లిఫ్టులు, ఎస్కలేటర్లు, ర్యాంపులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి
- రూ.5కే మినరల్ వాటర్
- ఇంటర్నెట్ కోసం వైఫై..
- పరిశుభ్రత, పచ్చదనానికి ప్రాధాన్యం


వరంగల్ రైల్వేస్టేషన్

సాక్షి, వరంగల్/ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే స్టేషన్ ఆధునిక సదుపాయాలతో ప్రయాణికులకు సాదర స్వాగతం పలుకుతోంది. అమృత్‌భారత్ పథకంలోభాగంగా రూ.25.41కోట్ల వ్యయంతో కాకతీయుల కళావైభవం ఉట్టిపడేలా పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఫలితంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ఏమాత్రం తీసిపోకుండా ఈ రైల్వే స్టేషన్‌లో కార్పొరేట్ సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. కాకతీయుల తోరణం, రెండు స్తంభాలపై రెండు ఏనుగులు, విశాలమైన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, శిల్ప కళా సంపద ఉట్టిపడేలా ఎలివేషన్, ర్యాంపులు, ల్యాండ్ స్కేపింగ్, టికెట్ కౌంటర్, ప్లాట్‌ఫామ్ లతో పాటు గోడలకు ఇరువైపులా కళాకృతులు, నూతన హంగులతో వెయిటింగ్ హాళ్లను తీర్చిదిద్దారు. ఫలితంగా ఐదేళ్ల క్రితం స్టేషన్‌లో ఉన్న సదుపాయాలతో పోలిస్తే ప్రస్తుతం ఆధునిక టెక్నాలజీతోకూడిన అభివృద్ధితోపాటు సదుపాయాలు కల్పించారు.

స్వచ్ఛభారత్‌లో ఇప్పటికే ఉత్తమ అవార్డు..

వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి, ఆదాయంలో దూసుకెళ్తోంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మొదటి స్థానంలో ఉండగా ఆ తర్వాతి స్థానాల్లో కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్లున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఉమ్మడి జిల్లాల ప్రజలు ఎక్కువ వరంగల్ రైల్వే స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఉన్నతాధికారులు ప్రయాణికుల సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యమినిస్తున్నారు. ఇందులో భాగంగా మూడు ప్లాట్ ఫామ్‌లతోపాటు స్టేషన్ పరిసరాలు పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నారు. ఈ చర్యలతో స్వచ్ఛ భారత్‌లో వరంగల్ రైల్వేస్టేషన్‌కు ఉత్తమ అవార్డు లభించింది. స్టేషన్ ఎదుట, ప్లాట్‌ఫామ్‌ల మధ్య పచ్చదనం కోసం గ్రీనరీ, పలు రకాల మొక్కలు పెంచుతున్నారు. వీటిని విధిగా సంరక్షిస్తుండడంతో రైల్వే స్టేషన్ ప్రాంగణం పచ్చగా కళకళలాడుతోంది.

ప్రయాణికుల నుంచి ఆదరణ పెరుగుతోంది..



వరంగల్ రైల్వేస్టేషన్‌కు ప్రతీరోజు సుమారు 24 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వీరి ద్వారా వార్షిక ఆదాయం 2024–2025లో సుమారు రూ. 82 కోట్లు ఉంది. ఈ నేపథ్యంలో ఆదాయాన్ని ఇంకా పెంచుకునే దిశగా ఆలోచించి ప్రయాణికులకు కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించాం. ఇందులోభాగంగా స్టేషన్ ప్రాంగణంలో లిఫ్టులు, ఎస్కలేటర్లు, వైఫై, టికెట్ బుకింగ్ కౌంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రతీ ప్లాట్‌ఫామ్‌పై లిఫ్ట్, ఎస్కలేటర్‌ను ఏర్పాటు చేశాం. స్టేషన్ ప్రధాన ప్రవేశ మార్గాన్ని, రిజర్వేషన్ టికెట్ బుకింగ్ కౌంటర్లను అధునాతనంగా తీర్చిదిద్దాం. ఇక్కడి నుంచి ఉన్నత శ్రేణి తరగతుల్లో ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

\- సారయ్య, స్టేషన్ మేనేజర్, వరంగల్

ఏఏ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయంటే..

- వృద్ధులు, మహిళలు, పిల్లలు మెట్లు ఎక్కడానికి, దిగడానికి ఇబ్బంది పడకుండా లిఫ్టులు, ఎస్కలేటర్లు సౌకర్యాలు కల్పించారు.
- ఒకటి, రెండు, మూడో నంబర్ ప్లాట్‌ఫామ్‌ల మధ్య ఆరు లిఫ్టులు, ఏడు ఎస్కలేటర్లు ఏర్పాటు చేశారు. ఫలితంగా లగేజీతో వచ్చే ప్రయాణికులకు ఇవి ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయి.
- రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై మినరల్ వాటర్ లీటర్ కేవలం రూ.5కే సరఫరా చేస్తున్నారు. ప్లాట్ ఫామ్‌లపై పలుచోట్ల మొబైల్ ఫోన్ల చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు.
- ప్రయాణికులకు ఇంటర్నెట్ కోసం వైఫై సదుపాయం అందుబాటులోకి తెచ్చారు.
- ప్రయాణికులకు వీవీఐపీ, ఏసీ, నాన్ ఏసీ వెయింటింగ్ హాళ్లు, ప్లాట్‌ఫామ్‌పై స్టీల్ కుర్చీలు, గద్దెలు, సిమెంట్ బెంచీలు, విశాలమైన టికెట్ బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు.
- స్టేషన్ ఆవరణ, ప్లాట్‌ఫామ్‌లు పరిశుభ్రంగా ఉంచడానికి పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఇందులోభాగంగా ప్రయాణికులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పలు చోట్ల డస్ట్ బిన్లు అందుబాటులో ఉంచారు.
- వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు రుచికరమైన భోజనంతోపాటు రైల్ కోచ్‌లో ఆహారం తిన్నామన్నా అనుభూతి కలిగించేలా రైల్ కోచ్ హోటల్‌నే ఏర్పాటుచేశారు. సమీప ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు సిటీవాసులు ఇక్కడ రుచికరమైన టీ,టిఫిన్, భోజనం చేసి ఎంజాయ్ చేస్తున్నారు. మరికొందరు రైల్వే స్టేషన్ ఎదుట గార్డెనింగ్, పురాతన డీజిల్ రైలు ఇంజన్ చూస్తూ సేదదీరుతూ కనిపిస్తున్నారు.

నేడు మేడారానికి మంత్రి పొంగులేటి రాక



ఎస్ఎస్‌తాడ్వాయి: రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం మేడారానికి రానున్నారు. సమ్మక్క–సారలమ్మ గద్దెల ప్రాంగణంలో సాలహారం నిర్మాణ పనులతోపాటు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించనున్నారు. అనంతరం మేడారంలోని హరిత హోటల్‌లో జిల్లా అధికారులతో అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణ పనులు, జాతర ఏర్పాట్లపై మంత్రి పొంగులేటి సమీక్షించనున్నారు. మంత్రి సీతక్క కూడా హాజరు కానున్నారు.

డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లింపునకు 23వ తేదీ వరకు గడువు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీబీఎం బీఎస్సీ, బీ ఒకేషనల్, బీసీఏ, బీహెచ్ఎం అండ్ సీటీ (రెగ్యులర్ అండ్ బ్యాక్ లాగ్) కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల పరీక్ష ఫీజు అపరాధ రుసుము లేకుండా ఈనెల 23వ తేదీవరకు చెల్లించేందుకు గడువు ఉందని కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు తిరుమలాదేవి, వెంకటయ్య తెలిపారు. రూ. 50 అపరాధ రుసుముతో ఈనెల 25వతేదీ వరకు చెల్లించొచ్చని తెలిపారు. ఆయా కోర్సుల ఫీజులు, తదితర వివరాలు సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ పరీక్షలు నవంబర్–డిసెంబర్‌లో నిర్వహించనున్నారు.

గద్దెల ప్రాంగణ పునర్నిర్మాణం గొప్ప వరం

- రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క


మ్యాప్ ద్వారా పనుల వివరాలను మంత్రి సీతక్కకు వివరిస్తున్న కాంట్రాక్టర్లు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని పునర్నిర్మించడం గొప్ప వరమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం మేడారంలో తల్లుల గద్దెల ప్రాంగణ విస్తీర్ణ పనుల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి భారీ స్థాయిలో నిధులు కేటాయించి మేడారం తల్లుల గద్దెల ప్రాంగణాన్ని పునర్నిర్మాణం చేస్తున్నారన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల, వంశ చరిత్ర చిత్రాలతో గద్దెల ప్రాంగణాన్ని పునర్నిర్మించే కార్యక్రమంలో మంత్రిగా తాను, పూజారులు, జిల్లా అధికారులు భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అమ్మవార్ల గద్దెల ప్రాంగణం చుట్టూ కొత్త సాలహారం నిర్మాణం పూర్తయిన తర్వాతే పాత సాలహారాన్ని తొలగించనున్నట్లు తెలిపారు. జాతర సమయం దగ్గర పడుతున్న తరుణంలో పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేసేందుకు జిల్లా అధికారయంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ శబరీశ్, డీఎస్పీ రవీందర్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శిల్ప కళా సౌందర్యం మహాద్భుతం


వేయిస్తంభాల గుడి వద్ద వలంటీర్లు..


శిల్పాల ప్రాంగణంలో కాకతీయుల తోరణం ఎదుట టూరిజం క్లబ్ వలంటీర్లు

వెంకటాపురం(ఎం) / ఖిలా వరంగల్: కాకతీయుల నిర్మాణాలు, శిల్ప కళా సౌందర్యం మహాద్భుతంగా ఉందని వరల్డ్ హెరిటేజ్ వలంటీర్లు అన్నారు. వరల్డ్ హెరిటేజ్ క్యాంపెయిన్‌లో భాగంగా రామప్పలో శిక్షణ పొందుతున్న వలంటీర్లు ఆదివారం పలు ఆలయాలను సందర్శించారు. రేగొండ పరిధిలోని పాండవుల గుట్ట, వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి, ఖిలా వరంగల్‌తో పాటు పలు పర్యాటక ప్రదేశాలను పరిశీలించారు. ఆలయాల విశిష్టత గురించి ప్రొఫెసర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి కాకతీయుల కట్టడాలు, శిల్ప సంపద బాగుందని, వీటిని సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ శ్రీధర్‌రావు, ప్రొఫెసర్ పాండురంగారావు, టూరిజం అసిస్టెంట్ ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్న తగాదా ప్రాణం తీసింది

- సబ్ జైలులో బ్లీచింగ్ పౌడర్ తాగిన రిమాండ్ ఖైదీ
- చికిత్స పొందుతూ మృతి


సబ్ జైలు ఎదుట రోదిస్తున్న మృతుడి భార్య, కుటుంబ సభ్యులు

జనగామ: రిమాండ్ ఖైదీ.. టాయిలెట్‌లో ఉన్న బ్లీచింగ్ పౌడర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. దేవరుప్పుల మండలం సింగరాజుపల్లికి చెందిన వారాల మల్లయ్య (42), అదే గ్రామానికి చెందిన పడకంటి బ్రహ్మచారి మధ్య గత నెల 23వ తేదీన స్నేహపూరిత వాతావరణంలో చిన్న తగాదా చోటు చేసుకుంది. ఆ ఘటనలో మల్లయ్య కర్రతో కొట్టగా, బ్రహ్మచారి చెయ్యి విరగడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి మల్లయ్యను ఈ నెల 8వ తేదీన కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో మల్లయ్యను అదే రోజు సాయంత్రం జనగామ సబ్‌జైల్‌కు పంపించారు. చిన్న తగాదాకు పోలీసులు కేసు నమోదు చేసి తనను జైలుకు పంపించారని మల్లయ్య తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. నాలుగు రోజులుగా సబ్‌జైలులో ఉంటున్న మల్లయ్య ఈ నెల11వ తేదీన ఉదయం అందరి ఖైదీల్లాగే టిఫిన్ చేసేందుకు బయటకు వచ్చాడు. అనంతరం సబ్‌జైలు ప్రాంగణంలో ఉన్న టాయిలెట్‌లోకి వెళ్లి అందులో ఉన్న బ్లీచింగ్ పౌడర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్వయంగా జైలు అధికారులకు చెప్పాడు. వెంటనే జైలు అధికారులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి (సుమారు మధ్యాహ్నం 12.40 నిమిషాలకు)కి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల12న మృతి చెందాడు.

సబ్ జైలు ఎదుట ఆందోళన..

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బాధితులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో సబ్ జైలు ఎదుట ఆందోళన చేపట్టారు. రూ.50 లక్షల పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతుడికి భార్య హైమ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విచారణకు రానున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ బృందం

జనగామ సబ్ జైలులో రిమాండ్ ఖైదీ మృతి ఘటనలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) బృందం ఆధ్వర్యంలో విచారణ జరుపనున్నారు. ఇందుకు సంబంధించి వారికి లేఖ సైతం వెళ్లినట్లు సమాచారం.

మనస్తాపంతోనే నా భర్త ఆత్మహత్య

చిన్న గొడవకు పోలీసులు జైలుకు పంపే కేసులు పెట్టారు. జైలుకెళ్లిన నా భర్తను అక్కడి అధికారులు మరుగుదొడ్లు కడిగించే పనులు చేయించారు. దీనిపై మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. మా ఇద్దరు పిల్లలు, పుట్టబోయే పసికందుకు ఇంటి దిక్కు లేకుండా చేశారు.

\-వారాల హైమ, మృతుడి భార్య

టాయిలెట్స్ శుభ్రం చేయించలేదు

మల్లయ్య జైలుకు వచ్చి నాలుగు రోజులు అవుతోంది. ఆయన ఆందోళన చెందుతుంటే కౌన్సెలింగ్ సైతం ఇచ్చా. టాయిలెట్‌లో బ్లీచింగ్ లేదు. రోజువారీగా క్లీన్ చేసే సమయంలో గోడకు అతక్కున్న దానిని తీసుకుని తాగాడు. అతడే వచ్చి ఇలా చేశానని చెప్పడంతో వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినం. ఇందులో మా నిర్లక్ష్యం లేదు. అతడితో టాయిలెట్స్ శుభ్రం చేయించలేదు.

\-కృష్ణకాంత్, సబ్‌జైలర్, జనగామ

జీవాంజి దీప్తికి అభినందనలు

పర్వతగిరి: ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో జరుగుతున్న విర్చ్యూస్ వరల్డ్ అథ్లెటిక్ చాంపియన్ షిప్–2025లో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన అథ్లెట్ జీవాంజి దీప్తి ఆదివారం జరిగిన ఫైనల్లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వేర్వేరుగా జీవాజి దీప్తి, కోచ్, తల్లిదండ్రులను అభినందించారు. మరెన్నో పతకాలు సాధించాలని, దేశ నలుమూలల జీవాంజి దీప్తి పేరు నిలవాలని ఆకాంక్షించారు.

294 వైన్స్.. 258 దరఖాస్తులు!

- ఏ జిల్లాలోనూ సెంచరీ దాటని అర్జీలు
- రూ.3 లక్షల ఫీజు, దీపావళి, స్థానిక ఎన్నికల ఎఫెక్ట్
- దరఖాస్తు చేసుకోవడానికి మిగిలింది ఇక 6 రోజులే


వైన్స్‌కు దరఖాస్తు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైన్స్‌లు, దరఖాస్తుల వివరాలు..

జిల్లా	వైన్స్	దరఖాస్తులు
వరంగల్ అర్బన్	67	89
వరంగల్ రూరల్	57	49
జనగామ	50	34
మహబూబాబాద్	61	57
భూపాలపల్లి	59	29

కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైన్స్‌కు దరఖాస్తు చేసేందుకు మద్యం వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 11 వరకు 294 వైన్స్‌కు కేవలం 258 దరఖాస్తులు రావడం గమనార్హం. సగటున ఒక వైన్స్‌కు ఒక దరఖాస్తు కూడా రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం వైన్స్ టెండర్ల దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షలకు పెంచింది. దీంతో మద్యం వ్యాపారులు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. మరోవైపు దీపావళి బాణసంచా అమ్మే వ్యాపారుల్లో సగం మంది మద్యం వ్యాపారం చేస్తారు. రూ.3 లక్షలు పెట్టి బాణసంచా విక్రయిస్తే రూ.6 లక్షలు వస్తాయి కదా.. ఇక మద్యం దరఖాస్తులు ఎందుకు అని వారు అనుకుంటున్నట్లు సమాచారం. కాగా, మూలిగే నక్కమీద తాటికాయ పడ్డ చందంగా స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చాయి. వైన్స్‌కు బదులు ఓటర్లకు సమర్పించుకుంటే ఎన్నికల్లో నైనా నెగ్గుతామంటూ దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి చూపలేదు.

23న లక్కీడ్రా..

వైన్స్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 18 చివరి తేదీగా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో దరఖాస్తుకు గడువు 6 రోజులు మాత్రమే మిగిలింది. అక్టోబర్ 23వ తేదీన లక్కీ డ్రా ద్వారా వైన్స్ కేటాయిస్తారు. 2023–25లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 15,926 దరఖాస్తులకు రూ.318 కోట్ల ఆదాయం వచ్చింది. కానీ, ఈసారి 30 వేల దరఖాస్తులు, రూ.500 కోట్ల ఆదాయం రావాలని పెట్టుకున్న టార్గెట్‌ను కనీసం చేరుకుంటారా లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

ఉద్యోగులు నైపుణ్యం పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి


ఉద్యోగికి పురస్కారం ప్రదానం చేస్తున్న నాగిరెడ్డి

- ప్రయాణికులే సంస్థకు దేవుళ్లు
- ప్రజలకు సేవలందించడం మన బాధ్యత
- ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి

హన్మకొండ: ఉద్యోగులు నైపుణ్యం పెంపొందించుకోవాలని టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అన్నారు. ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి పర్యటనలో ఆదివారం వరంగల్ రీజియన్‌ను సందర్శించారు. హనుమకొండలోని వరంగల్ రీజియన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిపోల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఆర్ఎం డి.విజయభాను, డిప్యూటీ ఆర్ఎంలు, డిపో మేనేజర్లు డిపో వారీగా కార్యక్రమాలు, వస్తున్న ఆదాయం, తిరుగుతున్న కిలో మీటర్లు తదితర వివరాలు ఎండీకి వివరించారు. అనంతరం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌ను పరిశీలించారు. వరంగల్–1 డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతి చక్రం పురస్కారాలు అందించారు. అనంతరం మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీకి ప్రయాణికులే దేవుళ్లన్నారు. వారిని ఆదరించి మర్యాదగా ప్రవర్తిస్తూ ఆక్యుపెన్సీ రేషియో పెంచుకోవాలన్నారు. ప్రజలకు సేవ చేయడం మన బాధ్యత అన్నారు. ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకుని మిగతావారు పోటీ పడి పని చేయాలన్నారు. వ్యయం తగ్గించడంతోపాటు ఆదాయం పెంపుపై దృష్టి సారించాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వరంగల్ నగరానికి 100 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయన్నారు. వరంగల్ రీజియన్ పనితీరు బాగుందని కితాబు ఇచ్చారు. టెండర్లలో అక్రమాలు జరిగాయని విలేకరుల ఆయన దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి రుజువైతే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ పి.సోల్మన్, ఆర్ఎం డి.విజయభాను, డిప్యూటీ ఆర్ఎంలు కేశరాజు భానుకిరణ్, మహేశ్, డిపో మేనేజర్లు, అద్దె బస్సుల యజమానులు పాల్గొన్నారు.

నాలుగు రైళ్ల దారి మళ్లింపు

కాజీపేట రూరల్: దానాపూర్–బెంగళూరు–దానాపూర్ మధ్య ప్రయాణించే సూపర్‌ఫాస్ట్ రైళ్ల సర్వీస్‌లకు అక్టోబర్ 13 నుంచి 16వ తేదీ వరకు కాజీపేట, సికింద్రాబాద్, గుంతకల్, ధర్మవరం స్టేషన్లలో హాల్టింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు.

దారి మళ్లించిన రైళ్లు ఇవే..

ఈ నెల 13న దానాపూర్–ఎస్ఎంవీవీ బెంగళూరు (03251) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 15న ఎస్ఎంవీటీ బెంగళూరు–దానాపూర్ (03252) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 14న దానాపూర్–ఎస్ఎంవీటీ బెంగళూరు (03259) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 16న ఎస్ఎంవీటీ బెంగళూరు–దానాపూర్ (03260) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు వరంగల్, విజయవాడ, ఒంగోలు, గూడూరు, పెరంబూర్, కటిపాడి, జోలర్‌పెట్టయ్, బంగారపేట్, వైట్‌ఫీల్డ్ మీదుగా కాకుండా వయా బల్లార్షా, కాజీపేట, సికింద్రాబాద్, సులేహలీ వెస్ట్, గుంతకల్, ధర్మవరం మీదుగా వెళ్లనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.